క్లుప్తంగా

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/గజ్వేల్: సిద్దిపేట కోమటిచెరువు, మిట్టపల్లి, పొన్నాల సబ్ స్టేషన్‌లలో మరమ్మతుల నిర్వహణలో భాగంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్‌లు శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందులో భాగంగా పొన్నాల, ఎన్సాన్‌పల్లి, మిట్టపల్లి, మందపల్లి, సురభి మెడికల్ కళాశాల తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. అదేవిధంగా గజ్వేల్ నుంచి సింగాటం గ్రామానికి వచ్చే 33కేవీ లైన్ మరమ్మతుల కారణంగా సింగాటం, దాచారం, అనంతరావుపల్లి గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ప్రజ్ఞాపూర్ విద్యుత్ ఏఈ సత్యం తెలిపారు.

విద్యార్థినులకు సన్మానం


ప్రశంసాపత్రాలతో విద్యార్థినులు

సిద్దిపేటరూరల్: తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో నిర్వహించిన సాహిత్య పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన రష్మితను, రమ్యశ్రీని శుక్రవారం డా.దేవులపల్లి రామానుజరావు కళామందిరం హైదరాబాద్‌లో సన్మానించి, నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారిని నారాయణరావుపేట ఎంఈఓ గౌరీ మోహన్, ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాస్, అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్, సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా గురుపూజోత్సవం


పూజలు చేస్తున్న కుటుంబ సభ్యులు, భక్తులు

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని గుండారెడ్డిపల్లి సిద్దప్ప వరకవి ఆశ్రమంలో ఆశ్రమ నిర్వాహకులు అనంతవరం మాణిక్య లింగం ఆధ్వర్యంలో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో సిద్దప్ప వరకవి చిత్రపటంతో శుక్రవారం శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులు, భక్తులు పూజలు నిర్వహించారు. సిద్దప్ప రచించిన గ్రంథాల్లోని పద్యాలు పాటలను చదివారు. వివిధ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన సిద్దప్ప శిష్యులు, భక్తులు ఆశ్రమంలో భజనలు చేశారు.

సమస్యలను పట్టించుకోని పాలకులు


మాట్లాడుతున్న గోపాలస్వామి

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండలంలోని ప్రజలు ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్నా పాలకులు పట్టించుకోవడం లేదని సీపీఎం నేత గోపాలస్వామి మండిపడ్డారు. శుక్రవారం గ్రామ 6వ మహాసభలో భాగంగా పోచంపల్లి భిక్షపతి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 1, 2వ తేదీల్లో గజ్వేల్‌లో పార్టీ మూడో మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాళ్లబండి శశిధర్, కనకయ్య, నర్సింహులు, రాయమల్లు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

దాతల సాయంతో ఆలయ అభివృద్ధి


మహాద్వారాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్వరశర్మ, రమేశ్‌గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్): దాతలు వస్తు, ధన రూపంలో అందిస్తున్న సాయంతోనే బగలాముఖీ శక్తిపీఠం దినదిన అభివృద్ధి చెందుతుందని వేద పండితుడు, బగలాముఖీ ఉపాసకుడు శాస్త్రుల వెంకటేశ్వరశర్మ, ఆలయ భూదాత రమేశ్‌గుప్తా అన్నారు. శివ్వంపేటకు చెందిన దివంగతులైన రాజమణిసత్యగౌడ్, శంకర్‌గౌడ్ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు పద్మ, అశ్విని, రాజేశ్వర్‌గౌడ్ రూ.10 లక్షల సొంత నిధులతో ఆలయం వద్ద నిర్మించిన మహాద్వారాలను శుక్రవారం వారు ప్రారంభించారు. కేవలం దాతలు అందించిన సహాయంతోనే ఆలయ నిర్మాణంతో పాటు ఇతర వసతుల కల్పన చేపట్టామన్నారు.

‘యాసంగి’కి సమాయత్తం

- వరి నార్లకు దుక్కులు సిద్ధం
- ఎరువుల దుకాణాలపై పర్యవేక్షణ శూన్యం
- దొడ్డు రకం సాగుకు రైతుల మొగ్గు
- 19న అనురాధ కార్తె సాగు ఆరంభం


నారుమడిని సిద్ధం చేస్తున్న రైతు

కోహెడ(హుస్నాబాద్): మండల రైతులు యాసంగి వరిసాగు పనులకు సమాయత్తమయ్యారు. గత వానకాలం సాగులో ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా దిగుబడులు సాధించారు. వర్షాలు కూడా సమృద్ధిగా కురిశాయి. ఈ నెల 19న అనురాధ కార్తె ప్రారంభం కావడంతో రైతులు దుక్కులు దున్ని నారు మడులు సిద్ధం చేస్తున్నారు.

ప్రణాళిక సిద్ధం

యాసంగి సాగు కోసం వ్యవసాయ అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. ప్రస్తుతం 3,100 మెట్రిక్ టన్నుల యూరియా, 500 మెట్రిక్ టన్నుల డీఏపీ, 1,900 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులతో పాటు 1,100 మెట్రిక్ టన్నుల పొటాష్; సాగుకు సరిపడా విత్తనాలకు సంబంధించిన నివేదికను ఉన్నతాధికారులకు అందించేందుకు సిద్ధమైనట్లు మండల వ్యవసాయ అధికారులు తెలిపారు. అలాగే యాసంగి సాగుకు అవసరమైన వరి, మొక్కజొన్న, పెసర, మినుములు తదితర విత్తనాలను అగ్రోస్, డీసీఎంఎస్, ఆకా, వివిధ ఎరువుల దుకాణాలలో అందుబాటులో ఉంచారు.


నిర్లక్ష్యంగా ఉంచిన ధరల పట్టిక

తూతూ మంత్రంగా తనిఖీలు

నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు మండల వ్యవసాయ అధికారులు చేపట్టిన తనిఖీలు తూతూ మంత్రంగా సాగిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చాలా దుకాణాలలో ధరల పట్టికలు, స్టాక్ వివరాలు, బిల్లులు చెల్లింపుల నిర్వహణలో దుకాణదారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అయినా అధికారులు చూసీ.. చూడనట్లు వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మండల వ్యాప్తంగా 24 ఎరువుల దుకాణాలు ఉన్నాయి. వాటిలో విత్తనాలు కొనుగోలు చేసిన రైతులకు బిల్లులు ఇవ్వడం లేదని చెబుతున్నారు.

అనురాధ కార్తెలో నారు పోస్త..



ఈ నెల19న అనురాధ కార్తె ఉంది. అదే రోజు నారు పోస్త.. ఈ కార్తెలో భూమిలో విత్తనం పడితే మంచి దిగుబడి వస్తుంది. కల్తీ విత్తనాలు అమ్మకుండా సార్లు తనిఖీలు చేయాలి. వరి నాట్ల కోసం అవసరమైన ఎరువులు, పురుగు మందులను అందుబాటులో ఉంచాలి. వ్యవసాయ అధికారులు పంటలను పరిశీలించి సలహాలు, సూచనలు ఇవ్వాలి.

– చుక్క అశోక్, రైతు కోహెడ

విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచాం



యాసంగి సాగు కోసం విత్తనాలు, ఎరువులను ఆయా దుకాణాలలో సిద్ధంగా ఉంచాం. 19నుంచి వరి నార్లు పోసేందుకు రైతులు సిద్ధం అవుతున్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలి. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నాం. సాగుపై సలహాలు, సూచనలిచ్చేందుకు గ్రామాల వారీగా ఏఈఓలను కేటాయించాం.

– సతీశ్, ఏఓ కోహెడ

రిజర్వేషన్ల కోసం కులగణన అవసరం

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య

మిరుదొడ్డి(దుబ్బాక): జనాభా ఆధారంగా రిజర్వేషన్లు రావాలంటే కుల గణన జరగాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఎన్యుమరేటర్లు చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను పర్యవేక్షించారు. వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సామాజిక న్యాయం అన్ని కులాలకు దక్కాలంటే కులగణన సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఎన్యుమరేటర్లకు సూచించారు.

మాజీ ఎంపీటీసీకి పరామర్శ

దౌల్తాబాద్(దుబ్బాక): దొమ్మాట గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ గన్నమనేని మోహన్‌రావు అన్న మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను వెంకటయ్య పరామర్శించారు. ఆయన వెంట నియోజకవర్గ సమన్వయ కర్త రణం శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.


మిరుదొడ్డి(దుబ్బాక): వివరాలు తెలుసుకుంటున్న వెంకటయ్య

మర్యాదపూర్వక కలయిక


మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో శివప్ప

సిద్దిపేటజోన్: రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని సిద్దిపేట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నరకుల శివప్ప శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మహారాష్ట్ర ఎన్నికల్లో భాగంగా నాందేడ్, ముఖేడ్ నియోజకవర్గ ఎన్నికల బాధ్యతలు నిర్వహిస్తున్న శివప్ప నాందేడ్‌లో ఉత్తమ్‌ను కలిసి సన్మానించారు. అంతకు ముందు జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, ముఖేడ్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రవీంద్రనాథ్ చోహన్, ఎమ్మెల్యే అభ్యర్థి హన్మంతరావు పాటిల్‌తో కలిసి ఎన్నికల ప్రచారం కోసం వచ్చిన కర్నాటక సీఎం సిద్ధరామయ్యకు స్వాగతం పలికారు.

బిర్సా ముండా పోరాటం యువతకు ఆదర్శం

హుస్నాబాద్: గిరిజన నాయకుడు బిర్సా ముండా పోరాట స్ఫూర్తి నేటి యువతకు ఎంతో ఆదర్శమని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో స్థానిక గిరిజన బాలుర సంక్షేమ హాస్టల్‌లో శుక్రవారం బిర్సా ముండా 150వ జయంతి కార్యక్రమం నిర్వహించారు. సర్వ శిక్షాభియాన్ జిల్లా మోనిటరింగ్ అధికారి భాస్కర్, నెహ్రూ యువ కేంద్ర జిల్లా కార్యక్రమ అధికారి కిరణ్ కుమార్ మాట్లాడారు. బిర్సా ముండా 22యేళ్ల వయస్సులోనే బ్రిటిషర్లపై యుద్ధం ప్రకటించాడని, దేశ స్వాతంత్ర్యోద్యమంలో ఒక ప్రముఖ వ్యక్తిగా నిలిచిపోయాడని కొనియాడారు. కార్యక్రమంలో యువజన ప్రతినిధి లక్ష్మణ్ రాజు, హాస్టల్ ప్రిన్సిపాల్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): గిరిజనుల కోసం రూపొందించిన చట్టాలు, హక్కులపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎంపీడీఓ భానోతు జయరామ్ అన్నారు. మండలంలోని కపూర్‌నాయక్‌తండాలో బిర్సా ముండా జయంతి జరుపుకున్నారు. పంచాయతీ కార్యాలయం ఎదుట గ్రామసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీల రక్షణకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. తహసీల్దార్ అనంతరెడ్డి, సీడీపీఓ జయమ్మ, ఎంపీఓ మోహన్‌నాయక్, ప్రభాకర్, అశోక్ పాల్గొన్నారు.


హుస్నాబాద్: మాట్లాడుతున్న భాస్కర్

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్‌రావు

ములుగు(గజ్వేల్): ప్రజా సంక్షేమమే ధ్యేయంగా, అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని పీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు అన్నారు. మండలంలోని అలియాబాద్‌లో శుక్రవారం ఆ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్‌గుప్త ఆధ్వర్యంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు తప్పుడు ప్రచారాలతో ప్రజలను రెచ్చగొడుతున్నారన్నారు. పార్టీని మరింత బలోపేతం చేస్తామని చెప్పారు. మాజీ ఎంపీపీ వెంకట్రాంరెడ్డి, భూపాల్‌రెడ్డి, గోపాల్‌రావు, మల్లారెడ్డి, యాదగిరి, నయిమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు అందజేస్తున్న శ్రీకాంత్‌రావు

స్నానాలాచరించి.. రామయ్యను కొలిచి

భక్తులతో కిటకిటలాడిన రామునిబండ

జగదేవ్‌పూర్(గజ్వేల్): కోర్కెలు తీర్చే స్వామిగా భక్తులు కొలిచే జంగంరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని బండమీది సీతారాముల ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ప్రతియేటా కార్తీక పౌర్ణమి రోజు నుండి రెండు రోజుల పాటు స్వామి వారి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. శుక్రవారం కార్తీక పౌర్ణమి కావడంతో ఆలయ నిర్వాహకులు వేణుగోపాలచారి, రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కుమార్ ఆధ్వర్యంలో జాతర ఘనంగా ప్రారంభమైంది. ఉదయం నుండి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తలస్నానాల కోసం పోటీ

ఆలయం వద్ద తలస్నానాల కోసం భక్తులు పోటీ పడ్డారు. గురువారం రాత్రే అధిక సంఖ్యలో ఆలయానికి చేరుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున ఉసిరి ఆకు, కాయలతో ఆలయం ఎదుట ఉన్న గుండంలో తలస్నానాలు చేసి స్వామిని దర్శించుకున్నారు. గుండంలో స్నానం చేస్తే సర్వరోగాలు నయం అవుతాయని భక్తుల నమ్మకం. దీంతో నీళ్ల కోసం పోటీ పడ్డారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు దీపారాధన చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయం వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జగదేవ్‌పూర్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


తలస్నానాలు చేస్తున్న భక్తులు

వైభవంగా సత్యనారాయణ వ్రతాలు

చేర్యాల(సిద్దిపేట)/దుబ్బాక: చేర్యాల అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం సాముహిక సత్యనారాయణ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ట్రస్టు అధ్యక్షుడు ఆంజనేయులు గుప్త, ట్రస్టు సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. అలాగే దుబ్బాక మున్సిపల్ పరిధిలోని చేర్వాపూర్ అనంతమహాలక్ష్మి ఆలయంలోను సాముహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు.


చేర్యాల(సిద్దిపేట): వ్రతమాచరిస్తున్న దంపతులు

దుబ్బాక ఆస్పత్రిలో అరుదైన ఆపరేషన్

3.7కిలోల గడ్డ తొలంగిపు

దుబ్బాక: స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం అరుదైన శస్త్రచికిత్స చేశారు. సూపరింటెండెంట్, హేమరాజ్‌సింగ్ ఆధ్వర్యంలో వైద్యులు ఓ మహిళ కడుపులో ఉన్న 3.7కిలోల గడ్డలతో పాటు గర్భసంచిని తొలగించారు. కామారెడ్డి జిల్లా బికనూర్‌కు చెందిన బాచగారి సుజాత రెండేళ్లుగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతూ అనేక ఆస్పత్రుల్లో చూపించినా ఫలితం దక్కలేదు. ఈ క్రమంలో ఆమె దుబ్బాక ఆస్పత్రికి రాగా వైద్యులు పరీక్షలు నిర్వహించి కడుపులో గడ్డలు ఉన్నట్టు గుర్తించారు. శుక్రవారం శస్త్ర చికిత్స నిర్వహించి గడ్డలతో పాటు గర్భసంచిని సైతం తొలగించారు.


సూపరింటెండెంట్ హేమరాజ్‌సింగ్‌తో వైద్యులు

సమగ్ర సర్వేపై అపోహలు వద్దు

తహసీల్దార్ సురేఖ

కోహెడ(హుస్నాబాద్)/బెజ్జంకి(సిద్దిపేట): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేపై ప్రజలు ఎలాంటి అనుమానాలు పెట్టుకోవద్దని, సిబ్బందికి సహకరించాలని తహసీల్దార్ సురేఖ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఎన్యుమరేటర్లు నిర్వహిస్తున్న సమగ్ర సర్వేను శుక్రవారం ఆమె పరిశీలించారు. కుటుంబాలకు సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేయాలని సూచించారు. అపోహలకు లోనుకాకుండా పూర్తి వివరాలు ఇవ్వాలని గ్రామస్తులను కోరారు. ఆమె వెంట ఆర్ఐ సురేందర్ ఉన్నారు. రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడానికే ప్రభుత్వం సమగ్ర సర్వే చేపట్టిందని ఆర్టీఏ ప్రచార కమిటీ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు రాసూరి మల్లికార్జున్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధిలో జనాభా దామాషా ప్రకారం లబ్ధి చేకూర్చేందుకే ప్రభుత్వం ఈ సర్వేను చేపట్టిందని తెలిపారు. ఎలాంటి అపోహలకు తావులేకుండా ప్రతి ఒక్క కుటుంబం సహకరించాలని సూచించారు.


కోహెడలో సర్వేను పరిశీలిస్తున్న సురేఖ

కనుల పండువగా కార్తీక పౌర్ణమి

కార్తీక పౌర్ణమి వేడుకలు శుక్రవారం కనుల పండువగా జరిగాయి. అన్ని మండలాల పరిధిలోని ఆలయాలు శివనామ స్మరణతో మారుమోగాయి. మహిళలు వేకువజామునే లేచి స్నానాలాచరించి ముక్కంటికి అభిషేకాలు నిర్వహించారు. నాచగిరి శ్రీలక్ష్మీ నృసింహ క్షేత్రం కార్తీక దీపారాధనలతో కాంతులీనింది. మహిళలు కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు.


నాచగిరి క్షేత్రంలో జ్యోతులు వెలిగిస్తున్న మహిళలు


దుబ్బాకరూరల్: పూజలు చేస్తున్న రఘునందన్‌రావు


సిద్దిపేట పట్టణం కోటిలింగేశ్వర ఆలయంలో..


చిన్నకోడూరులో మహిళల దీపారాధన


హుస్నాబాద్‌రూరల్: అభిషేకం చేస్తున్న భక్తులు


చేర్యాల వేణుగోపాలస్వామి ఆలయంలో..

సంక్షిప్త వార్తలు

◆ చంద్రమౌళీశ్వర క్షేత్రంలో శతావధానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని శ్రీలలిత చంద్రమౌళీశ్వరక్షేత్రం ఆవరణలో ప్రముఖ శతావధాని ఆముదాల మురళి ఆధ్వర్యంలో 18 నుంచి 20 వరకు శతావధానం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు పండరి రాధాకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆలయ 14వ వార్షికోత్సవం సందర్భంగా లలితాదేవి విగ్రహ ప్రతిష్ఠ, పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

◆ తుక్కాపూర్ రోడ్డుకు మరమ్మతులు

తొగుట(దుబ్బాక): మండల పరిధిలోని తుక్కాపూర్ రోడ్డు గుంతలమయంగా మారడంతో విద్యుత్ కాంట్రాక్టర్ చిక్కుడు స్వామి చొరవతో శుక్రవారం మరమ్మతులు చేపట్టారు. గ్రామ శివారులోని సిద్దిపేట-గజ్వేల్ ప్రధాన రహదారి నుంచి తుక్కాపూర్ వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. రోడ్డుకు రెండువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను గ్రామ యువకులతో కలిసి మల్లన్న సాగర్ నిర్మాణ సంస్థ కేఎస్‌ఆర్ మేనేజర్ కొండల్‌రెడ్డి తొలగించారు. గ్రామ యువకులు బాల్‌రాజు, గోపాల్, మహేశ్, రాజు పాల్గొన్నారు.

◆ హామీల అమల్లో ప్రభుత్వం విఫలం

చిన్నకోడూరు(సిద్దిపేట)/గజ్వేల్‌రూరల్: ఆరు గ్యారెంటీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, మాజీ ఎంపీపీ, ఉపాధ్యక్షుడు పాపయ్య, సీనియర్ నాయకుడు జంగిటి శ్రీనివాస్ ఆరోపించారు. శుక్రవారం వారు చిన్నకోడూరులో మాట్లాడుతూ ఇచ్చిన హామీలు అమలు చేయాలని ప్రశ్నిస్తే అక్రమంగా అరెస్టులు చేయడం సరికాదన్నారు. కక్ష సాధింపు చర్యలు మానుకుని, పరిపాలనపై దృష్టి సారించాలని సూచించారు. గజ్వేల్‌లో కొల్గురు మాజీ ఎంపీటీసీ జ్యోతి స్వామి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం గత బీఆర్‌ఎస్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అమలు చేయకుండా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఆంజనేయులు, స్వామిగౌడ్, అనిల్ పాల్గొన్నారు.

◆ మహాసభలను జయప్రదం చేయండి

మద్దూరు(హుస్నాబాద్): స్థానిక తాజ్‌గార్డెన్‌లో 19న జరగనున్న సీపీఎం మండల మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కమిటీ ఆధ్వర్యంలో మహాసభ కరపత్రాలను ఆవిష్కరించారు. అన్ని వర్గాల ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రమేశ్, నరేశ్, శ్రీకాంత్, సురేశ్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

◆ సబ్‌స్టేషన్ ఆపరేటర్‌పై దాడి

చేగుంట(తూప్రాన్): సబ్‌స్టేషన్ ఆపరేటర్‌పై వ్యక్తి దాడి చేసిన సంఘటన మండలంలోని కర్నాల్‌పల్లి సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కర్నాల్‌పల్లి సబ్‌స్టేషన్‌లో శ్రీనివాస్ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. సురేశ్ అనే వ్యక్తి సబ్‌స్టేషన్ విద్యుత్ వైర్లపైకి ఇనుప రాడ్‌తో విసిరే ప్రయత్నం చేయడంతో ఆపరేటర్ శ్రీనివాస్ అడ్డుకున్నాడు. దీంతో అతను ఆపరేటర్ శ్రీనివాస్‌పై దాడి చేయగా, తలకు గాయాలయ్యాయి. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో శ్రీనివాస్ ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

◆ కారు ఢీకొని సెక్యూరిటీ గార్డు మృతి

మనోహరాబాద్(తూప్రాన్): విధులు ముగించుకొని రోడ్డుపై వెళ్తున్న సెక్యూరిటీ గార్డును కారు ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఈ ఘటన మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సుభాష్‌గౌడ్ కథనం మేరకు.. సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్‌కు చెందిన దుడ్డోజు సంజీవచారి(52) పది రోజుల కిందట మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌లో ఉంటూ స్థానికంగా ఉన్న గ్లోస్టర్ కేబుల్‌లో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం విధులు ముగించుకొని జాతీయ రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా తూప్రాన్ వైపు నుంచి మేడ్చల్ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సంజీవచారికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కారు పల్టీలు కొట్టగా బెలూన్స్ ఓపెన్ కావడంతో ఇద్దరికి గాయాలయ్యాయి.

◆ నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ధర్మాసాగర్ గేట్ వద్ద నూతనంగా నిర్మించిన శివ పంచాయతన నవగ్రహ సహిత సంజీవాంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు శనివారం నుంచి ప్రారంభమవుతాయని హనుమాన్ యూత్ సభ్యులు శుక్రవారం తెలిపారు. శనివారం గో, గురు, గణపతిపూజ, స్వస్తివాచనం, అగ్నిప్రతిష్ఠ, జలాధివాసం, పంచామృతధివాసం, ప్రదోషకాలపూజలు నిర్వహించనున్నారు.

◆ అయ్యప్ప దీక్షల స్వీకరణ

పెద్దశంకరంపేట(మెదక్): కార్తీక మాసాన్ని పురస్కరించుకొని పలువురు భక్తులు శుక్రవారం అయ్యప్ప దీక్షను స్వీకరించారు. ఈ సందర్భంగా వేణుగోపాల స్వామి ఆలయంలో గురుస్వామి రామచంద్రా స్వామి ఆధ్వర్యంలో దీక్షలు స్వీకరించారు.